# పంజరం

జె. సుబ్బలక్ష్మి

**కిటికీలో కూర్చుని ఊచల మధ్య మొహం పెట్టి బయటికి చూస్తోంది ఉష. అక్కడ కూర్చుంటే అటు రోడ్డూ కనిపిస్తుంది, ఇటు కాంపౌండు లోపల ఆడుకునే పిల్లలూ కనిపిస్తారు.**

తను కూడా తలుపు తెరుచుకుని కిందికి పరుగెత్తాలని ఉంది గాని దయ్యంలా రంగి అక్కడే తచ్చాడుతోంది కదా ! తనకి అది కాపలా. తను జోరుగా పరుగెత్తకూడదు. "అయ్యో పడిపోతారు అమ్మాయిగారూ...." అంటూ ఇది వెనకాలే తయారు ! గబ గబా మెట్లు దిగకూడదు. "కాలు జారుతుంది జాగ్రత్త" అని హెచ్చరిక. బాల్కనీలో నిలబడి కిందికి వంగకూడదు. "ఆఁ...ఆఁ...అంతగా వంగకండి." అని పురమాయింపు. ఏం ఆ మాత్రం జాగ్రత్త తనకి తెలీదా ? ఇన్ని ఆంక్షలకు తోడు 'గారూ' అన్న మర్యా దొకటి ! ఎవడి క్కావాలి బోడి మర్యాద ? తనను 'ఒసే ఉషా' అని పిలిచినా ఫరవాలేదు - తనను ఆడుకోడానికి బయటికి పంపిస్తే చాలు. అయినా ఈ పెద్ద వాళ్ళ కింత భయ మెందుకో ? తను బయటికి వెళితే ఏమవుతుందిట ? ఎక్కడికైనా పారిపోతుందా ? బూచా డెత్తుకుపోత డా ? కాసేపు ఆడుకుని మళ్ళీ వచ్చేస్తుంది. అంతేగా ! 'పిల్లను జాగ్రత్తగా చూసుకో' అని అమ్మ చెప్పినంతమాత్ర న ఈ రంగి తనను మరీ ఇంతలా కాపలా కాయాలా ?

పక్కింటి ప్రసూన ఎంచక్కా కిందికి దిగి వెళ్ళి ఇష్టమొచ్చినంత సేపు ఆడుకుంటుంది. వాళ్ళమ్మ వద్దంటున్నా అదేం ఖాతరు చేయదు. అవును మరి. ఎంతైనా ఆమె అమ్మ కదా ! రంగి తన అమ్మ కాదు కాబట్టే అంత కఠినంగా ఉండగలుగుతుంది.


అసలు తన స్కూలు పొద్దున్నుంచి సాయంత్రం దాకా ఉంటే ఏ గొడవా ఉండకపోను. కాని ఇప్పుడు టైం మార్చేశారు. ఒక్క పూటే స్కూలు. ఎనిమిది గంటల నుంచి పన్నెండు వరకే. అప్పుడు ఇంటికి వచ్చి అన్నం తిని హోంవర్కు పూర్తి చేసేసుకుంటే ఇక రోజంతా ఖాళీయే. మధ్యాహ్నం పడుకుందామంటే నేమో నిద్ర రాదు. త నేం ముసలమ్మ గనకనా పగలు నిద్రపోవడానికి ?

కింది నుంచి 'వన్.... టూ... త్రీ.... ఫోర్' అని ప్రసూన గొంతు వినబడుతోంది. అంటే అది స్కిప్పింగు ఆడుతోందన్న మాట. తనను పిలిస్తే ఆటకు రాలేదని కాబోలు తనకి వినబడేలా గట్టిగా అంకెలు లెక్కబెడుతోంది. తను ఆటకు వెళ్ళదని కాదు - వెళుతుంది. కాని ఎప్పుడు ? ఎండ పూర్తిగా తగ్గిపోయి చల్లబడ్డాక. మళ్ళీ ఆరు గంటల కల్లా ఇంట్లోకి వచ్చేయాలి. లేకపోతే రంగి వచ్చి తనను పైకి లాక్కొచ్చేస్తుంది. ఇది అమ్మ ఆర్డర్. రేడియో - టి.వి. వాళ్ళయినా టైము నంత ఠంచనుగా పాటించరేమో గాని రంగి మాత్రం చాలా కరెక్టు. ఆరు దాటిం దంటే ఎటువంటి పరిస్థితిలోనూ తనను బయట ఉండనీయదు.

ఈ రంగి బారి నుంచి తప్పించుకోవడం ఎలా గబ్బా ?.... ఆఁ... దీనికి ఒకటే ఉపాయం ఉంది. తను అలిగి కూచోవాలి. అన్నం కూడా తినకుండా స్ట్రయిక్ చేయాలి. అప్పుడు అమ్మ భయపడిపోయి చచ్చినట్టు ఆఫీసు మానేస్తుంది. రంగిని ఊరికి పంపించేసి తను ఇంట్లోనే ఉండిపోతుంది. ఆఁ... అదే మంచి ఉపాయం. ఈ రోజు నుంచే - కాదు ఈ క్షణం నుంచే స్ట్రయిక్ మొద లెట్టేయాలి. అవును. అందుకే కిటికీలో కూచున్నది కూచున్నట్టే ఉండిపోవాలి. ఎవరితోనూ మాట్లాడకూడదు. రంగి వచ్చి అరచి గీపెట్టినా సరే తను దిగకూడదు అంతే !

అయినా ఈ మధ్య రంగికి బాగా పొగ రెక్కింది. కాకపోతే తన మీద కళ్ళెర్రజేస్తూ చీటికీ మాటికీ కసురుకుంటుందా ? వచ్చినప్పుడు ఎలా ఉండేది పిల్లి పిల్లలా నక్కి నక్కి నడుస్తూ అణిగి మణిగి పడివుండేది. త నెంత అల్లరి చేసినా ఏమీ అనకపోగా దిళ్ళతో కొట్టి మీదపడి రక్కినా గిల్లినా భరించి ఊరుకునేది. తన కోపం తగ్గించడానికి మంచి మంచి ఖథలు చెప్పి తనను మురిపించేది. తనను నవ్వించడానికి నానా తంటాలు పడేది. అలాంటిది ఇప్పుడు త నంటే కొంచెం కూడా లక్ష్యం లేదు. అసలు దీని కంత కారణం అమ్మ ! అమ్మే గనక ఈ రంగిని అదుపులో పెట్టి ఉంటే ఇది ఇప్పు డింత నెత్తి కెక్కేది కాదు. అయ్యో రామ ! అదుపులో పెట్టడం మాట దేవు డెరుగు, తన మీద మొత్తం అథారిటీ రంగికే ఇచ్చి కూచుంది అమ్మ. పైగా తన ముందే "ఇదిగో రంగీ... ఉష అల్లరి చేస్తే చూస్తూ ఊరుకోకు. బాగా నాలుగు తగిలించు. లేకపోతే ఇక దాన్ని పట్టడమే కష్టం." అని చెబుతుందా ? పనిమనిషికి ఇంతకంటె మంచి ఛాన్సు ఇం కేం కావాలి ? మధ్యాహ్నం మటుకు మధ్యాహ్నం... తను స్కూలు నుంచి రాగానే అన్నానికి కూచుంటే వడ్డించిందా ? ఊహూఁ.... ముందు కాళ్ళూ చేతులూ కడుక్కోవాలిట ! బోడి ఆర్డరు. ఎందుకు కడుక్కోవాలి ? త నేమైనా మట్టిలో ఆడి వచ్చిందా చక్కగా స్నానం అదీ చేసి, శుభ్రంగా ఉతికి ఇస్త్రీ చేసిన యూనిఫారం తొడుక్కుని మరీ వెళ్ళింది. రాగానే బూట్లు, సాక్సు విప్పేసింది కూడాను. ఇం కేముంటుంది మురికి కాళ్ళకి ? అయినా చెబితే వింటుంది గనకనా ? ఉత్తి మొండిఘటం. చివరికి తనే ఆకలికి తాళలేక లేచి వెళ్ళి బలవంతాన కాళ్ళూ చేతులూ కడుక్కు వస్తే అప్పుడు పెట్టింది అన్నం.

అసలు అమ్మకు బుద్ధిలేదు. అమ్మా - నాన్నా ఇద్దరూ వెళ్ళి ఆఫీసుల్లో కూచోకపోతే ఏం ? అమ్మ ఇంట్లోనే ఉం డొచ్చుగా ! ఊహుఁ... అమ్మకి తన మీది ప్రేమ కంటే ఉద్యోగం మీది మోజే ఎక్కువ.



అందుకే ఆదరాబాదరా ఇంత వండివడేసి నాన్న వెనకాల స్కూటరు మీద కూచుని తుర్రుమని ఆఫీసుకు వెళ్ళిపోతుంది. మళ్ళీ సాయంకాలం చీకటి పడితే గాని ఇద్దరూ ఇంటికి తిరిగి రారు. అప్పటి దాకా తను ఇంట్లో వంటరిగా బిక్కు బిక్కు మంటూ కాలం గడపాలి. పోనీ కిందికి దిగి వెళ్ళి హాయిగా ఆడుకుందా మంటే అందుకు అవకాశమే లేదు. రంగి కళ్ళు ఎప్పుడూ తన మీదే ఉంటాయి. నిధి నిక్షేపాల మీద కూచుని కాపలా కాసే నాగు పామైనా కాస్త ఏమరపాటుగా ఉండవచ్చు నేమో గాని ఈ రంగి మాత్రం పొరపాటున కూడా తన మీది నుంచి కళ్ళు తిప్పుకోదు. లోప లెక్కడో పని చేసుకుంటోంది కదా అని తను నాన్న గదిలో కెళ్ళి ఏదైనా వస్తువుకు చెయ్యి పెడితే చాలు, ఆ దెక్కణ్ణుంచి చూస్తుందో, ఎలా చూస్తుందో తెలీదు వెంటనే ఆఘమేఘాల మీద పరుగెత్తుకు వచ్చి తనను గది లోంచి బయటికి లాక్కెళ్ళడమే కాకుండా గది తలుపు గొళ్ళెం పెట్టేస్తుంది కూడా.


మొన్నటికి మొన్న వీపు మీద ఎంత గట్టిగా కొట్టిం దని ? అబ్బ ! తల్చుకుంటే ఇప్పటికీ వీపు చుర్రు మంటుంది. సన్నగా పీనుగులా ఉండే రంగికి అంత బల మెక్కడిదో ! అది చేత్తోనే కొట్టినా ఇనపకర్రతో కొట్టి నంత గట్టిగా తగుల్తుంది. అంత దెబ్బ కొట్టడానికి త నేం పెద్ద నేరం చేసిందని ? నాన్న టేబిలు మీదున్న ఫైలు తీసుకుని అందులో పిచ్చి గీతలు గీస్తూ కూచుంది అంతేగా ? ఆ కాస్త దానికి అలా వెనక నుంచి వచ్చి తనను కొడుతుందా ? తను మాత్రం దెబ్బతిని ఊరుకుంటుందా ఏంటి - ఒక్క ఉదుటున లేచి రంగి చెయ్యందుకుని కళ్ళు మూసుకుని కసుక్కున కొరికేసింది అంతే ! ఇక చూడాలి రంగి చిందులు. అంత పెద్ద రంగీ చిన్న పిల్లలా చిందు లేస్తూ కెవ్వున కేక పెట్టి ఏడవసాగింది. అది చూసి తనకు భలే సరదా వేసింది. తన ఏడుపంతా ఇట్టే ఎగిరిపోయింది. నన్ను మాత్రం ఏడిపిం చొచ్చు ?... ఇప్పుడు నువ్వు కూడా బాగా ఏడు - అని బిగ్గరగా అరిచి చెప్పా లనిపించింది కానీ, మళ్ళీ ఎందుకులే అని ఊరుకుండిపోయింది. రంగి కేకలూ, ఏడుపూ విని పక్కింటి ఆంటీ, ప్రసూన ఇద్దరూ పరుగెత్తు కొచ్చారు. రంగి జరిగిన సంగతి చెప్పగానే ఆవిడ తనవైపు కొరకొరా చూసి రంగి వేలుకి సపర్యలు చేయడం మొదలు పెట్టింది.

పసుపు అద్దడ మేమిటి, ఆయింటుమెంటు రాయడమేమిటి, కట్టు కట్టడమేమిటి - ఒకటే హడావిడి ! ప్రసూన కళ్ళింత చేసుకుని తననూ, రంగినీ మార్చి మార్చి చూస్తూ అయోమయంగా నిలబడిపోయింది. అప్పటికి తన వీపు నొప్పి తగ్గిపోయినా కావాలని ఇంకా వెక్కుతూ ఓరకంటితో వా ళ్ళందరినీ గమనిస్తోంది.

సాయంత్రం అమ్మా నాన్నా ఆఫీసు నుంచి వచ్చారు. వా ళ్ళింకా ఇంట్లో కైనా రాకముందే వాళ్ళకు వార్త లన్నీ అందిపోయాయి. ఇక చెప్పే దేముంది. వాళ్ళు గడపలో అడుగుపెట్టగానే ప్రారంభమయ్యాయి తనకు తిట్లూ - చివాట్లూను. నాన్న కంటె అమ్మ మరీను. తన కంటె ఆ రంగే ఎక్కువయిపోయింది ఆవిడకి. దాన్ని బుజ్జగించి బతిమాలి డాక్టరు దగ్గరికి తీసికెళ్ళింది. రాత్రి దానికి అన్నం కలిపి పెట్టడమే కాకుండా తినడానికి చెంచా కూడా ఇచ్చింది. ఇక ఆ రోజు ఇల్లంతా ఒకటే నిశ్శబ్దం ! అవును మరి - అల్లరి చేసే తానే అలిగి పడుకుంటే ఇక ఇంట్లో సంద డేముంటుంది ? నాన్న - పాపం.... తను పాడు చేసిన కాగితా లన్నీ మళ్ళీ రాసుకుంటూ కూచున్నాడు చాలా సేపు.

మర్నా డంతా అమ్మ తనతో మాట్లాడనే లేదు. ఎంత సేపూ 'రంగీ... ఇప్పుడు వే లెలా ఉంది ? ఇంకా నొప్పెడుతోందా ? ఈ పూట మందేసుకున్నావా ?' అని ఒకటే పరామర్శలు. అంటే తనేమైపోయినా అమ్మకు లెక్కలేదన్న మాట ! మర్నాడు పొద్దున లేచినప్పట్నుంచీ తను చేసిన ఘనకార్యాన్ని ఎవరితోనైనా చెప్పుకోవాలని మనసు ఒకటే ఆరాటపడిపోయింది. కాని ఎవరితో చెప్పడం ? స్కూల్లో ప్రసూనకు తప్ప ఇంకెవరికీ రంగి ఎవరో తెలియదాయె. ప్రసూ నేమో అన్నీ అప్పుడే చూసేసిందాయె.... పోన్లే ఎవరికీ చెప్పకపోతేనేం తనకి మాత్రం రంగికి మంచి శాస్తి చేశా నని చాలా సంతోషంగా ఉంది.

ఆ రంగికి తన పళ్ళు కాస్త తగిలాయో లేదో అంతలోకే అదేదో పెద్ద ఘోరం జరిగిపోయినట్టు తనని తిట్టారు అమ్మా నాన్నా అందరు పిల్లల అమ్మా నాన్నలూ ఇలాగే ఉంటారా ? ఏ ముండరు. వాళ్ళంత మంచి వాళ్ళు - తమ పిల్లల్ని ఎంతో ప్రేమగా చూస్తారు. ఒక్క తన అమ్మా నాన్నే పని మనిషిని వెనకేసుకొచ్చి సొంత కూతుర్ని కేకలేస్తారు. అందుకే వాళ్ళ మీద తనకి బాగా కోప మొచ్చి అలిగి కూచుంది. ఎవరు పిలిచినా పలకదు, అన్నం తినదు - ఎవ రెంత అరిచి గీపెట్టినా వాళ్ళ వైపు చూడను కూడా చూడదు. చెవిటి దానిలా ఏం వినబడనట్టు కూచుండిపోతుంది అంతే !




రాత్రి అమ్మా నాన్నా తన గురించి చాలా సేపు మాట్లాడుకున్నారు. "ఇది ఇంత అల్లరి చేసి ఏడిపిస్తే రంగి ఇక మ నింట్లో ఉండగలదా ? అతి కష్టం మీద ఇంత మంచి పని పిల్ల దొరికింది. ఎంతో నెమ్మదస్తురాలు. ఓపిగ్గా, నమ్మకంగా పనిచేస్తుంది. ఇది వెళ్ళిపోతే మనకు మళ్ళీ ఇలాంటి మనిషి దొరకడం కష్టం. అయినా ఉష రోజు రోజుకీ మరీ మితిమీరిపోతోంది. దా న్నెలా కంట్రోల్ చేయాలో తెలియడం లేదు" అని అమ్మ ఒకటే వాపోయింది. ఇక ఆ తరువాత తను వాళ్ళ మాటలు వినిపించుకోలేదు. 'ఇది పోతే ఇలాంటి మనిషి దొరకడం కష్టం' అన్న మాటే చెవుల్లో గింగురుమంటోంది. అందులోనూ 'ఇది వెళ్ళిపోతే' అన్న మాట తియ్యగా, చల్లగా తోచింది. ఒకవేళ నిజంగానే అలా జరిగితే ఎంత బాగుణ్ణు ! హాయిగా - స్వేచ్ఛగా ఉండొచ్చు. మళ్ళీ మునుపటిలా మేడ దిగి వెళ్ళి ఇంచక్కా ఆడుకోవచ్చు. ఇదివరకు లక్ష్మి ఉన్నప్పుడు తనకి ఏ విధమైన అడ్డంకులూ ఉండేవి కావు. ఆమె తన జోలికి రాకుండా లోప లెక్కడో పనిచేసుకుంటూ ఉండేది. లేకపోతే ఇరుగుపొరుగిళ్ళ పనిమనుషులతో కబుర్లు చెప్పుకుంటూ ఉండేది. త నేమో హాయిగా ఇష్టమొచ్చినంత సేపు ఆడుకునేది. లక్ష్మి ఏ రోజూ తనను ఆంక్షలు పెట్టలేదు. బయట ఎంత ఎండగా ఉన్నా సరే తను ఆడుకుంటానంటే వెంటనే పంపించేసి ఎంచక్కా తలుపేసుకుని లోపల నిద్రపోయేది. అందుకనే కాబోలు కొద్ది రోజుల్లోనే అమ్మకు లక్ష్మి మీద అయిష్టం ఏర్పడింది. అందులోను 'ఇక్కడ రంగి అనే ఒద్దికైన పిల్ల ఉంది. పంపమంటె పంపిస్తాను' అని పిన్ని ఉత్తరం రాసినప్పట్నుంచీ అమ్మ లక్ష్మి మీద చీటికీ మాటికీ చిర్రుబుర్రులాడ్డం మొదలెట్టింది. 'ఒసేయ్ లక్ష్మీ... రోజంతా పిల్లని ఎండకీ, మట్టికీ వదిలేస్తావట నిజమేనా ? అసలు ని న్నెందుకు పెట్టుకున్నా మనుకున్నావ్ ? మాకు డ బ్బెక్కువయి కాదు - మేము లేనప్పుడు పాపను జాగ్రత్తగా చూసుకోవాలని. తెలిసిందా ? దాన్ని గాలికి వదిలేసి నువ్వు ఇంట్లో వెచ్చగా పడుకోవడానికి కాదు..." నీ ప్రతాపాలు రోజు రోజుకీ పెరిగిపోతున్నాయి లక్ష్మీ... కాలనీలో ఎవరి నోట విన్నా నీ మాటలే" అని ప్రతి రోజూ ఏదో ఒక టంటూండేది. నాన్నతో నేమో "అయ్యో వంచదార తెచ్చి రెండు రోజులు కూడా కాలేదు అప్పుడే సగానికి పైగా అయిపోయిందండీ" అనో, అబ్బ అక్కడ చూస్తే ధరలు మండిపోతున్నాయి. ఇక్కడేమో తెచ్చిన వస్తువులు తెచ్చినట్టే మాయం. ఎలా చావాలో అర్థం కావడం లేదు..." అనో పితూరీలు చెబుతూండేది. 'నువ్వు ఫలానా వస్తువు తీశావా ?' అని లక్ష్మిని డైరెక్టుగా ఎప్పుడూ అడగలేదు గాని దానికి వినపడేలా పక్కింటి ఆంటీతో "అన్నీ ఇంటికి చేరేస్తోందేమో నని నా కనుమానంగా ఉందండీ.... ఈ కాలంలో పనిమనుషుల్ని ఎలా నమ్మేది చెప్పండి. ఇల్లూ వాకిలీ వదిలేసి జీతం రాళ్ళ కోసం అటు ఉద్యోగాలకు పోతమా...ఇటేమో వీళ్ళు ఇల్లంతా గుల్ల చేసేస్తారు. మేమేమో రెక్కలు ముక్కలు

చేసుకుని సంపాదించి తెచ్చిపడేయడమూను వీళ్ళేమో ఇంచక్కా నీడపట్టున కూచుని ఇల్లు దోచేయడమూను" అని రకరకాల విసుర్లు విసిరేది. అది విని తనకు లక్ష్మి మీద జాలేసింది. అమ్మ మీద కోపం కూడా వచ్చేది. అక్కడికి తన జీతం మొత్తం లక్ష్మే కాజేసినట్టు. అంతగా అయితే ఉద్యోగం మానేసి ఇంట్లో కూచోవచ్చుగా ? లక్ష్మి మాత్రం ఎన్నాళ్ళిలా మాటలు పడుతూ ఊరుకుంటుంది పాపం ? ఓ రోజు కోపం వచ్చి పని మానేసి చక్కాపోయింది.

అందుకోసమే వేచివున్నట్టు అమ్మ వెంటనే రెండు రోజులు సెలవు పెట్టి వెళ్ళి మరీ తీసుకొచ్చింది ఈ రంగిని. తీసుకొచ్చి తన నెత్తిన పెట్టింది. అమ్మ రంగిని తీసుకొచ్చింది ముఖ్యంగా తన కోసమే నట. హుఁ ! తనను చూట్టం కోసం కాదు - తనను చంపుకు తినడం కోసం.

అబ్బ ! ఈ రంగి గనుక పనిమానేసి వెళ్ళిపోతే ఎంత బాగుంటుంది ? అప్పుడు మంచి వాళ్ళెవరూ దొరక్క చివరికి అమ్మే ఇంట్లో ఉండిపోవలసి వస్తుంది. ఆహాఁ.... రోజంతా అమ్మ తనతోనే ఉంటే ఎంత మజా ! కాని ఈ రంగి వెళ్ళిపోయినప్పటి మాట కదా !

ఉష అటూ ఇటూ మెసిలింది. ఓసారి గడియారం వంక చూసింది - అందులో చిన్న ముల్లు ఇంకా మూడు దగ్గరే ఉంది. మధ్యాహ్నం పూట టైము ఎంతకీ గడవదేమిటి పాడు? అని విసుక్కుంది. ఓ టి.వి. ఉండదు, ఏమీ ఉండదు ఇలాం టప్పుడు. బయటికి వెళ్ళి పిల్లలతో ఆడుకునేందుకు వీల్లేదు... అబ్బ.... ఏం తోచడం లేదు. అమ్మకి ఎన్నిసార్లు చెప్పినా తన బాధ అర్థం కాదు. "నువ్వు ఆఫీసు కెళ్ళ కమ్మా... నాకు బోర్ కొడుతుంది.."అని ఎంత బతిమాలినా వినదు. "ఎందుకు బోర్ కొడుతుంది ? హోంవర్కు చేసుకో... నీ దగ్గర బోలెడని బొమ్మ లున్నాయి కదా అవి పెట్టి ఆడుకో" అంటుంది. హోంవర్కుఐ చేసుకోవడం ఎంత సేపు ? ఓ అరగంటలో అన్నీ అయిపోతాయి. ఆ తరువాత అంతా ఖాళీయేగా... అందరి అమ్మలూ ఆఫీసు కెళతారేమిటి ? ఏం వెళ్ళరు. పిల్లలకు మంచి మంచి తాయిలాలు చేసి పెడతారు. వాళ్ళని సినిమాలకీ, బజార్లకీ తీసికెళతారు. తన కా అదృష్టం లేదు.

అంతకీ ఓసారి మారాం చేసింది కూడాను. "ప్రసూన వాళ్ళమ్మ కూడా ఆఫీసుకు వెళ్ళదు. నువ్వెందుకు వెళ్ళాలి ? నాన్నతో చెప్పి ఉద్యోగం మానేయమ్మా" అని. కాని వింటేనా ? తన మాటకు పెద్దగా నవ్వి తనను దగ్గరికి తీసుకుంది. "కొన్నాళ్ళు ఓపిక పట్టు తల్లీ... అలాగే మానేస్తా. ఈ ఇంటి లోన్ కటి తీరిపోతే ఆ తరువాత నేను ఆఫీసుకు వెళ్ళకపోయినా ఫరవాలేదు" అంది. కాని అప్పుడు కూడా అమ్మ నిజంగా ఆఫీసు మానేయదు. ఆ సంగతి తనకు బాగా తెలుసు. ఎందుకంటె నాన్న అమ్మతో చెప్పిన మాట వినలేదు గనకనా ? "రమా, నీకు త్వరగా ప్రమోషన్ వస్తే బాగుణ్ణోయ్. నా క్కొంత రిలీఫ్‌గా ఉంటుంది. ఈ పాత డొక్కు స్కూటర్ అమ్మిపారేసి మనం కొత్త మోటర్ సైకిల్ కొనేయొచ్చు. ఆఫీసు దూరం కాబట్టి స్పీడుగా పోవడానికి అదే బాగుంటుంది." అప్పుడు తను వెంటనే అందుకుని "ప్రమోషన్ అంటే ఏమిటి నాన్నా ?" అని అడిగింది. నాన్న నవ్వి "ప్రమోషన్ అంటె ఇంకా పై సీటుకు వెళ్ళడం... ఈజీగా చెప్పాలంటే అమ్మ జీతం బోల్డు పెరుగుతుం దన్నమాట. అర్థమైందా ?" అన్నాడు అమ్మ బుగ్గ మీద చిటికె వేసి. "మరి అమ్మేమో కొన్నాళ్ళు తరువాత ఉద్యోగం మానేస్తా నంటోందిగా... కదమ్మా ?" అమాయకంగా అడిగింది తను. అమ్మ నాన్న వైపు తిరిగి నవ్వింది. కళ్ళు చికిలించి ఏదో సైగ చేసింది. ఆ తరువాత ఇద్దరూ కలిసి పగలబడి నవ్వారు. తన కప్పు డర్థమైపోయింది. అమ్మ ఉత్తుత్తిగా అలా అందని. ఈ పెద్దవాళ్ళెప్పుడూ ఇంతే. పిల్లల కేం తెలీ దనుకుంటారు. కాని నిజంగా చూస్తే తనకు తెలిసినంత వాళ్ళకే తెలీదేమో !

ఆ మధ్య ఓసారి ఏమైందని... నాన్న ఫ్రెండొకాయన ఇంటికి వచ్చాడు. ఆయనతో అదీ ఇదీ మాట్లాడుతూ నాన్న "అయినా ఈ కాలం పిల్లలు భలే తెలివి గల వాళ్ళోయ్. వాళ్ళ బుర్రల్లో పెద్ద పెద్ద ఆలోచన లుంటాయి. వాళ్ళ మనసుల్లో ఏవేవో నూతన భావాలు ఉదయిస్తూంటాయి...." అని ఇంకా బరువైన మాటలు చాలా చెప్పాడు పిల్లలను గురించి. ఆయన తనకేసి ఆశ్చర్యంగా చూట్టంతో తను గర్వంగా నవ్వుకుంది. ఆ రోజు ఈ పెద్ద వాళ్ళ కున్న చెడ్డ అలవా టొకటి తను గమనించ గలిగింది. అదేమి టంటే వాళ్ళు చెప్పే దొకటి - చేసే దొకటీ నని. తమ పిల్లల తెలివి తేటల గురించి ఇతరులతో గొప్పగా మాట్లాడడం. అదే పిల్లలతోనేమో 'నీ కేమీ తెలీదు ఊరుకో అని కసురు కోవడం. అందుకే ఈ పెద్దవాళ్ళను ఎప్పటికీ నమ్మకూడదు.


ఉష మళ్ళీ క్రిందికి చూసింది. ఇప్పుడు ప్రసూన రవి వాళ్ళతో కలిసి క్రికెట్ ఆడుతోంది. నిన్న ప్రసూన తనతో చెప్పింది. "మీ రంగి మా ఇంటికి వచ్చి నీ మీద చాడీలు చెబుతోందే ఉషా... నువ్వు స్కూలు నుంచి రాగానే మాటామంతీ లేకుండా గప్‌చిప్‌గా ఉంటున్నావట. సాయంకాలంపూట కూడా ఆడుకోవడం లేదట. నువ్విలా ఉండడం చూసి దానికి భయ మేస్తోందిట." చెప్పొద్దూ తనకి భలే ఒళ్ళు మండిపోయింది. తను అల్లరి చేసినా కష్టమే. నోరు మూసుకుని ఓ చోట కూచున్నా కష్టమే. అసలు తన ఇంట్లో తను ఏమైనా చేసుకుంటుంది తనిష్టం. మధ్యలో ఇదెవరట తనని అడగడానికి ?

సాయంత్రం అమ్మ రాగానే తను కోపంగా రంగి సంగతి చెప్పింది. దానికి అమ్మ ఏమందో తెలుసా ? ఆగు... ఈ వేళ దాని పని పడతా" అని ఆ తరువాత జరిగిం దేమిటి ? పని పట్టడం మాట అటుంచి అమ్మ ఇంకా రంగిని పిల్చి తన దో చీర తీసి ఇచ్చింది. పైగా అంది కదా - "రంగీ....అలా బజారుదాకా వెళ్ళి కాసేపు తిరిగేసి రాకూడదటే ? పాపం అస్తమానం ఇంట్లో ఉండాలంటే నీకూ విసుగ్గానే వుంటుంది." హుఁ.... తన స్వంత కూతురు జైల్లో ఉన్నట్టు ఇంట్లో ఒంటరిగా వుంటే ఏం బాధలేదు గాని ఆ పనిమనిషి మీద అంతటి ప్రేమ ! అప్పుడు గబుక్కున వెళ్ళి అమ్మ చీర పట్టుకుని "అసలు నేను నిజంగా నీ కూతుర్నేనా ?" అని నిలదీసి అడగాలన్నంత ఉక్రోషం వచ్చింది గాని మళ్ళీ ఎందుకులే అనుకుని ఊరుకుంది. అప్పుడే తన కనిపించింది ఇక రేపట్నుంచీ ఎవరి తోనూ మాట్లాడకూడదని. అమ్మ వచ్చి బతిమాలినా సరే....చాక్లెట్లూ, బిస్కెట్లూ ఇస్తానని ఆశ పెట్టినా సరే...తను మాత్రం అలక మానకూడదు.

అందుకే ఈ రోజు పొద్దున లేచినప్పట్నుంచీ ఎవరితోనూ ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

పొద్దు నెమ్మదిగా గడచిపోయింది. ఎండతగ్గి వాతావరణం చల్లబడగానే బిలబిలమంటూ మరి కొంత మంది పిల్లలు వచ్చి చేరారు అక్కడికి. ప్రసూన తనని చూసి మళ్ళీ పిలిచింది అక్కణ్ణుంచే. తనూ వెళ్ళాలను కుంది కాని అంతలోనే తన అలకమాట గుర్తుకొచ్చి ఆగిపోయింది. నిజమే, తను మామూలుగా ఆడుకోడాని కెళ్ళిపోతె ఇక తను అలిగినట్టు అమ్మా నాన్నల కెలా తెలుస్తుంది ? అందుకని ఇక్కణ్ణుంచి కదలకూడదు.


క్రింద క్రికెట్ ఆట అయిపోయింది. ఇప్పుడు రవి రకరకాల గమ్మత్తులు చేసి అందర్నీ నవ్విస్తున్నాడు. ఒక తాడును వెనక తోకలా కట్టుకుని బుగ్గలు పూరించి కోతిలా గంతులు వేస్తున్న రవిని చూస్తుంటే తనకు నవ్వాగడం లేదు. అయితే రంగి ఆ చుట్టూ పక్కలే తచ్చాడుతూండడంతో తోసుకొస్తున్న నవ్వును బలవంతాన ఆపుకుంటోంది. అంతలో రవి తనను చూడనే చూసేశాడు. ఇంకే ముంది ? తను అలిగి బుంగమూతి పెట్టుకు కూచోడం గమనించాడు



కాబోలు మరింత జోరుగా తోక ఝాడిస్తూ హుషారుగా ఇంతెత్తున ఎగర సాగాడు. ఇక నవ్వాపు కోవడం తన వల్ల కాలేదు. అక్కడుంటే అలక సాగదని గ్రహించి కిటికీలోంచి దిగివచ్చి తన మంచం మీద దభేలుమని పడి పోయింది. అవును, మంచం మీద పడుకుని కూడా అలగొచ్చు గా... ఇది ఇంకా బాగుంటుంది కూడా.

తన మంచం కూడా మరోవైపు కిటికీ పక్కగానే వుంది. ఆ కిటికీలోంచి కనిపించే కాస్తంత ఆకాశం వైపు చూస్తూ పడుకుంది. అలా దిక్కులేని దాని లాగా ఒంటరిగా పడుకుని వుంటే ఉండుండి తన కెందుకో ఏడుపు తన్నుకొచ్చేస్తోంది. మనసు బాగుండక తను ఇంతగా బాధపడిపోతుంటే దానికి - అదే ఆ రంగికి చీమ కుట్టి నట్టయినా లేదు. పనయి పోయింది కాబోలు ఎంచక్కా తల దువ్వుకుని ముస్తాబయి బాల్కనీలో దర్జాగా నుంచుంది. ఏం అలా నిలబడక పోతే అలిగి పడుకున్న తన దగ్గరకొచ్చి బుజ్జ గించొచ్చుగా.. అయ్యో పాపం అని జాలిపడి కాసేపు తనను ఆడించ వచ్చుగా... ఉహూ...అదేదీ లేకపోగా తను అలిగిందే చాలని మహాసంతోషంగా వీధిలో వేడుకలు చూస్తూ నుంచుంది. తను వంటరిది.





అందరూఉండికూడా ఎవరూ లేని వంటరిది. తనేమై పోయినా ఈ ఇంట్లో ఎవరికీ అక్కర్లేదు.

అలా ఆలోచిస్తూ పడుకున్న ఉషకు తనకు తెలియకుండానే కళ్ళు మూతలు పడ్డాయి.

"ఉషా..ఉషా...లే..ఎటూ కాని వేళప్పుడు ఈ నిద్రేమిటి? లే...కళ్ళు తెరు....నీ కోసం ఏం తెచ్చానో చూడు..." అన్న మాటలు అమ్మ తియ్యని గొంతుతో వినబడేసరికి చటుక్కున మెలకువ వచ్చింది. అమ్మ మొహం తన మొహానికి బాగా దగ్గరగా వున్నట్లు తన చెంపకు తగులుతున్న ఆ వెచ్చని ఊపిరే చెబుతోంది. అమ్మ తన కంత దగ్గరగా ఉంటే తన కెంతో ఇష్టం. ఆమె ఎప్పటికీ అలాగే ఉండిపోవాలని కోరుకుంటుంది తన మనసు. కళ్ళు తెరచి అమ్మ మొహాన్ని తన చిట్టి చేతులతో పట్టుకుని ముద్దు పెట్టుకోవాలని పించింది. అందులోనూ 'నీ కోసం ఏం తెచ్చానో చూడు' అన్న మాట తనను ఊరించేస్తోంది. అయినా తనిప్పుడు కళ్ళు తెరవకూడదు. అమ్మ కేసి చూడకూడదు. అలా చూస్తే తన అలక సంగతేం కాను? అందుకని దేనిమీదా ఆసక్తి లేనట్టు అలా పడుకునుండి పోయింది.

"ఉషా.. లే తల్లీ... లేమ్మా.. కోపం వచ్చిందా? ఏదీ కళ్ళు తెరు. అమ్మ మీద అలుగుతా రా ఎవర్తైనా? ఛ! మా బంగారు తల్లి ఎంతో మంచి ద్ది. అలా ఎవరి మీదా ఎప్పుడు అలగదు. కదమ్మా!" అంటూ తన బుగ్గ మీద గట్టిగా

ముద్దుపెట్టుకుంది అమ్మ. తనకు దుఃఖం, సంతోషం రెండూ ఏక కాలంలో కలిగాయి. అమ్మ మెడ చుట్టూ చేతులు వేసి గట్టిగా హత్తుకోవాలనీ, అమ్మ తనను వదిలి ఎక్కడికీ వెళ్ళ లేనంతగా ఆమె గుండెల్లో దూరి పోవాలనీ, "రేపట్నుంచీ నువ్వు ఆఫీసు కెళ్ళొద్దమ్మా..నువ్వెళ్ళి పోతే నాకు చాలా బోర్‌గానూ, భయంగానూ ఉంటుంది" అని చెప్పాలనీ కోరిక కలిగింది. అయితే అలాంటి దేం చేయలేదు. ఆ కోరికను తనలోనే అదిమి పెట్టుకుని అలాగే మెదలకుండా ఉండిపోయింది.

అమ్మ తన చెయ్యందుకుని అందులో ఏదో వస్తువు పెట్టింది. అది చాక్లెట్టని ఇట్టే తెలిసి పోయింది తనకు. అయినా దాన్ని పట్టుకోలేదు. అలాగే పరుపు మీద వదిలేసింది. దాంతో అమ్మకి కోపం వచ్చేసింది కాబోలు 'పోనీ అని బతిమాలుతున్న కొద్దీ గారం ఎక్కువయి పోతోంది నీకు" అనేసి చటుక్కున లేచి లోపలికి వెళ్ళి పోయింది. పోతూ పోతూ రంగిని అడిగింది. "ఈ వేళ ఏ మయిందే దీనికి? ఏ దైనా అల్లరి పని చేసిందని నువ్వు గాని కోపడ్డా వా?" "అబ్బే లేదమ్మ గారూ... ఈ రోజు అమ్మాయి గారు అల్లరి పను లేమీ చేయలేదు. అసలు బడి నుంచి వచ్చినప్పట్నుంచీ ఉలుకు పలుకూ లేదు. శానా సేపు కిటికీలో దిగాలు పడి కూచున్నారు. ఆ తరువాత ఇట్టా మంచం మీద వాలిపోనారు. అంతే ఏ మయిందో నా కేం తెలీదు." వినయంగా సమాధానం చెప్పింది రంగి.

'ఏమో బాబూ ఈ పిల్లతీరే అర్థం కావడం లేదు' అని గొణుక్కుంటూ అమ్మ బట్టలు మార్చుకోడానికి వెళ్ళి పోయింది. దాంతో అంత వరకూ తనలో అణచిపెట్టిన దుఃఖం కట్ట తెంచుకుంది. తను వెక్కి వెక్కి ఏడవసాగింది. హఠాత్తుగా వినిపించిన ఆ ఏడుపుకి భయపడి అమ్మ పరుగెత్తుకొచ్చింది. మార్చుకోబోతున్న చీరన లాగే వదిలేసి వచ్చేసింది లాగుంది....అమ్మ చీర కట్టుకోకుండా అలా ఉత్త లంగా, జాకెట్టు మీ దుంటే తనకి చూడడానికి కేమిటో ఇబ్బందిగా వుంటుంది. అందుకని గబుక్కున పక్కకు తిరిగి పోయింది? "ఎ వరేమన్నారు నిన్ను?" అని రకరకాలుగా బుజ్జగించి అడగ సాగింది. అయినా తను నోరు విప్పలేదు. ఈ లోగా నాన్న కూడా వచ్చాడు. వెంటనే అమ్మ వెళ్ళి గబగబా చీరకట్టుకుని వచ్చింది. ఇద్దరూ కలిసి చాలా సేపు బతిమాలుకున్నా లాభం లేకపోయింది. పైకి ఏడుస్తు న్నా లో లోపల మాత్రం తనకు చాలా సంతోషంగా ఉంది. రోజూ తన మానాన తనను చదువుకోమని చెప్పేసి వంటింట్లో అమ్మా, తన గదిలో టేబిల్ ముందు నాన్నా ఉండిపోయేవారు. అలాంటిది ఈ రోజు ఇద్దరు అంతసేపు పనులు మానేసి తన పక్కన కూచోడం సంతోషం కాదు మరీ! లోలోపలే నవ్వుకుంది. తను. ఓ గంట సేపు అదే విధంగా గడిచి పోయింది. ఇద్దరూ తనను బుజ్జగించి, ముద్దులాడి, బతిమలాడి బామాలి విసిగి పోయారు. అలిసి పోయారు. చివరికిక చేసేది లేక లేచి అవతలకి వెళ్ళిపోయారు. వెంటనే తన ఏడుపు ఆపేసి గప్ చిప్‌గా పడుకుంది.

రాత్రి భోజనాలకు అన్నీ సిద్ధం చేసింది రంగి. అమ్మా నాన్న అప్పుడు మరోసారి గదిలో కొచ్చి తనని అన్నానికి పిలిచారు. తను ఉలకలేదు. పలక లేదు. కనీసం లేచే ప్రయత్నం కూడా చేయలేదు. ఇక ఇలా మాటలతో లాభం లేదని నాన్న తనని అమాంతం ఎత్తుకెళ్ళి డైనింగ్ టేబిల్ ముందున్న కుర్చీలో కూచోపెట్టాడు. అప్పుడు కూడా కాలూ చెయ్యీ కదప లేదు తను. నాన్న ఎలా కూచోపెట్టాడో అలాగే కూచుంది. కళ్ళెత్తి వాళ్ళవైపు చూడను కూడా చూడలేదు. చూస్తే మరి నవ్వొచ్చేస్తుందిగా అందుకని. నాన్న అన్నం కలిపి ముద్ద తన నోటి కందించ బోయాడు. తను నోరు తెరచి ఆ ముద్దను అందుకోలేదు. సగం నోట్లోనూ, సగం బయటా పడిన ఆ అన్నం ఎక్కడి దక్కడ అలాగే ఉండిపోయింది. తన మకురుతనం చూసి అమ్మలో ఓర్పు నశించింది. "ఎంత పొగరో చూశారా? మీ రిలా గారం చేస్తుంటే అది మరింత నెత్తికెక్కి కూర్చుంటుంది. అంతే వదిలేయండి. ఓ పూట అలిగి అన్నం మానేస్తే మరేం మునిగి పోదు లేండి... ఆక లేస్తే అదే చచ్చినట్లు తింటుంది" అంది కోపంగా, వెంటనే కుర్చీలోంచి కిందకు దూకింది. "ధన్...ధన్" మని చప్పుడయ్యేలా నడుస్తూ బాత్ రూంవైపు వెళ్ళిపోయింది. నోట్లో వున్న అన్న మంత ఉమ్మేసి నోరు కడుక్కుని మళ్ళీ అలాగే చప్పుడయ్యే లా నడుస్తూ గదిలో కెళ్ళి మంచం మీద బోర్లా పడింది.


నాలుగైదు రోజులు అదే విధంగా గడచి పోయాయి. ఇంట్లో అదో రకమైన నిశ్శబ్దం వ్యాపించింది. తను ఎవరి తోనూ మాట్లాడడం లేదు. ఎందు లోనూ ఆసక్తి చూపడం లేదు. ఎవరైనా దగ్గరకొచ్చి తనను ముట్టుకుంటే వాళ్ళ చేతిని విసిరి కొట్టేస్తోంది. ఆకలేసి నప్పుడు తనకు ఏది అందుబాటులో వుంటే అదే కాస్త తింటున్నదే తప్ప ఎవరైనా ఏమైనా తినమని ఇస్తే పుచ్చుకోవడం పూర్తిగా మానేసింది.

ప్రతిరోజూ అమ్మా, నాన్నా ఆఫీసు నుంచి రాగానే తన దగ్గర చేరి కాసేపు అలక తీర్చే ప్రయత్నం చేయడం - తను ఎంతకీ లొంగక పోయేసరికి విసిగి వేసారి ఎవరి పనుల్లో వాళ్ళు మునిగి పోవడం మామూలయిపోయింది. పాపం రోజంత ఆఫీసుల్లో పనిచేసి అలసిపోయి వస్తారేమో - ఇంటికి రాగానే తన దో సమస్య వాళ్ళకి. మరి విసిగి పోక ఏమవుతా రు.?

ఒక్కోసారి - తన కెందుకిలా చేస్తోంది? అమ్మా, నాన్నల నెందుకు బాధ పెడుతోంది? ఎప్పట్లా హాయిగా నవ్వుతూ తుళ్ళుతూ సంతోషంగా ఉండి వాళ్ళను కూడా సంతోషంగా పెట్ట వచ్చు కదా. అనిపిస్తుంది కాని మళ్ళీ అంతలోకే మనసు మారి పోతుంది. ఏం అమ్మ మాత్రం తనని బాధ పెట్టడం లేదూ? రంగి తన ప్రాణాన్ని కొరుక్కు తినడం లేదూ? అందుకే వాళ్ళూ బాధ పడాలి.

సరిగ్గా తిండి తినక పోవడం వల్లనేమో ఈ మధ్య చాలా నీరసంగా ఉంటోంది ఒంట్లో. ఇంటి దగ్గర చాలా ముభావంగా ఉండి ఉండి అలవాటయి పోయి ఇప్పుడు స్కూల్లో కూడా అలాగే వుంటోంది. అప్పటికే ఇద్దరు ముగ్గురు టీచర్లు అడిగారు కూడాను. "ఉషా.. అలా డల్‌గా ఉన్నా వేం? హెల్త్ బాగా లేదా?" అని. తను ఏమని సమాధానం చెబుతుంది? ఓ సారి వాళ్ళ వంక చూసి ఊరుకుంది అంతే. పాఠాల మీద శ్రద్ధ తగ్గిపోయింది. ఒక్కో సారి వాళ్ళేం చెబుతున్నారో అసలు అర్థమే కాదు. 'హెూం వర్కులో కూడా చాలా తప్పులు చేసేస్తోంది. అసలు స్కూలుకి వెళ్ళాలన్నా బద్ధకంగా బోరుగా వుంది.

క్రిస్మిస్ సెలవు లొచ్చాయి. ఇప్పుడయితే ఇక బలవంతంగా కాళ్ళీడ్చుకుంటూ స్కూలుకి వెళ్ళేపని కూడా లేదు. పొద్దస్తమానం కిటికీలో కూచునో, లేక బాల్కనీలో నిలబడో కింద ఆడుకునే పిల్లల్ని చూస్తూ కాలం గడిపేస్తోంది. అంత మంది పిల్లలు హాయిగా స్వేచ్ఛగా ఆడుకుంటూంటే తనొక్కతీ ఇలా బందీ లాగా కిటికీలో కూచుం దేమిటి? ఎవరి మీ దో కోపం? ఎనా ళ్ళీ అలక? ఇవన్నీ మర్చి పోయి తనూవాళ్ళల్లో కలిసి పోవచ్చుకదా అన్న ఆలోచనయితే వస్తుందిగాని లేవాలంటేనే బద్ధకం. లేచి కిందకి దిగివెళ్ళే ఉత్సాహం, శక్తి మాత్రం తనలో లేవు. ప్రసూన కనీసం పది సార్లన్నా తనను పిలవడానికి కొచ్చుంటుంది. ఒక్కసారి కూడా తను వెళ్ళక పోయేసరికి దానికీ కోపం వచ్చిందేమో ఇప్పుడు పిలవడమే మానేసింది. అంతేకాదు, తను ఇదివరికటిలా కబుర్లు చెప్పక ముభావంగా ఉండడంతో తనతో మాట్లాడడం కూడా తగ్గించేసింది. ప్రసూన ఒక్కతే కాదు, రవి, సు జాత, కిరణ్, స్వాతి అందరూ తనలో వచ్చిన



మార్చును చూసి తన నుంచి దూరమై పోయారు.అదితల్చుకుంటే మరింత దిగులనిపిస్తుంది తనకు.

ఇలా ఒక్క త్తే ఒంటరిగా కూచోవడం వల్లనే కాబోలు - తనకు కూడా పెద్ద వాళ్ళలా ఆలోచనలు వస్తున్నాయి. వాళ్ళ లాగే గంటలు గంటలు ఆలోచనల్లో గడిపేస్తోంది తనిప్పుడు.

నాన్నని సైకిలు కొని పెట్టమని వేధించడం లేదు. రంగి వీపు మీదెక్కి కూచుని గుర్రం ఆట ఆడాలని ఉబలాట పడడం లేదు. అమ్మను కాడ్‌బరీస్ చాక్లెట్లు కావాలని అడగడం లేదు. అసలు తనకిప్పుడు ఏ కోరికలూ లేవు. కూచున్నంత సేపు కిటికీలో కూచోవడం. ఆ తరువాత మంచం మీద వాలి పోవడం.

మొదటో ' ఆఁ....ఏదో రెండురోజులు మొండి కేస్తుంది - ఆ తరువాత అదే సర్దుకుంటుందిలే' అనుకున్న అమ్మా, నాన్నా ఇప్పుడు రోజు రోజుకీ నీరసించి నిర్లిప్తంగా మారిపోతున్న తనను చూసి నిజంగా బెంగపడుతున్నారు. రాత్రిళ్ళు ఒళ్ళు వెచ్చబడేసరికి కంగారు పడుతున్నారు.

"మన ఉష కేమయిందో నండి.. అంత అల్లరి చేస్తూ చలాకీగా తిరిగే పిల్ల ఇప్పుడిలా దెయ్యం పట్టిన దానిలా మారి పోయిందేమిటి? నా కెందుకో చాలా భయంగా వుందండీ దాన్ని చూస్తుంటే" అంది అమ్మ రాత్రి నాన్నతో.

"నాకూ అదే అర్థం కావడం లేదు రమా... రంగి ఏమన్నా చేసిందేమో అంటే పాపం అది అలాంటి పిల్లకాదు.. మరి ఉన్నట్టుండి మన పాప ఎందుకిలా నీరసించి పోతోంది? ఓ మాట లేదు మంతీలేదు. అస లా మొహంలో కళే లేదు. రాను రాను రోగిష్టి దానిలా తయారవుతోంది.... నా కయితే కాలూ చెయ్యీ ఆడటం లేదనుకో."

"ఛ! అవేం మాటలండి? ఉష ఇలా కావడానికి" రంగికి ఏ సంబంధమూ లేదు. నోట్లో నాలిక లేని పిల్ల రంగి. దాన్ని గురించి మీ రలాంటి ఆలోచన లేం పెట్టుకోకండి..."

"అది కాదు రమా... నేను రంగినేం తప్పు పట్టడం లేదు. ఉష పరిస్థితి చూసి భయపడుతున్నా నంతే. నీకు ప్రమోషన్ రావలసిన ఈ టైములో ఈ అవాంతరం వచ్చి పడిందే అని నా బాధ. పోనీ మనం ఉషను ఎవరైనా సైక్రియాటిస్టుకు చూపిస్తేనో?"

"ఆఁ...మరీ అంత ప్రమాదమేం లేదు లేండి. రోజంతా ఇంట్లో వంటరిగా ఉండి కాస్త దిగులు పట్టుకున్నట్టుంది అంతే. నన్ను ఆఫీసు మానేసి ఇంట్లో ఉండమని ఒకటే గొడవ. వేలెడంత లేని పిల్ల కోరిక తీర్చడం కోసం బంగారం లాంటి ఉద్యోగాన్ని వదులుకుంటారా ఏమిటి? ఏదో కాస్త మనసు పాడు చేసుకు నిజ్వరం తెచ్చుకుంది. మందులు వేసి జాగ్రత్తగా చూసుకుంటే అదే నయమైపోతుంది. దాని కోసం మీరెందుకింతగా వర్రీ అవుతారు."

ఈ మాటలన్నీ తనకు వినిపిస్తూ నే ఉన్నాయి. తను నిద్ర పోయిందని వాళ్ళనుకున్నారు గాని తన కీ మధ్య నిద్ర కూడా సరిగ్గా పట్టడం లేదు. అమ్మా, నాన్నా అంత సీరియస్‌గా తన దిగులుకు కారణాలు వెతుకుతూంటే తనకు నవ్వొస్తోంది. పెద్ద వాళ్ళందరూ తామే తెలివి మంతు లనుకుంటారు గాని తన లాంటి చిన్న పిల్లల మనసులో ఏముంటుందో ఎప్పటికీ తెలుసుకోలేరు.

## పాశ్చాత్య పతివ్రత

పాతివ్రత్యానికి పుట్టినిల్లు భారతదేశం అని మనం అనుకుంటుంటాం. మనలో భర్త మరణ వార్త వినగానే గుండె ఆగిపోయిన వారున్నారు. ఐచ్ఛికంగా సతీ సహగమనం చేసిన వారు ఎందరో ఉన్నారు. అంతే కాని భర్త శవాన్నో దేహంలోని భాగాన్నో బ్రతికున్నన్నాళ్ళూ దగ్గర ఉంచుకున్న వాళ్ళెవరూ కనిపించరు. కాని పాశ్చాత్య స్త్రీ అయిన లేడీ ఎలిజబెత్ రాలీ ఈ విధంగా ప్రవర్తించి తన పాతివ్రత్యాన్ని చాటుకుంది. ఆమెకి తన భర్త సర్ వాల్టర్ రాలీ అంటే వల్ల మాలిన ప్రేమ. ఆయన చని పోయాక ఆ వియోగాన్ని భరించ లేక పోయిం దామె. భర్త తలను వేరు చేయించి, అది చెడి పోకుండా దానికి బామ్ పట్టించి ఒక పళ్ళెంలో ఉంచి నిత్యమూ తన దగ్గరనే ఉంచుకునేది. ఎక్కడికి వెళ్ళినా ఆ తలని కూడా వెంట తీసుకు వెళ్ళేది. ఈ విధంగా ఆమె 29 సంవత్సరాల పాటు వైధవ్య జీవితం గడిపింది.

-కె.ఆర్.కె. మోహన్

అమ్మా, నాన్నా తన గురించి ఇంతగా బుర్రలు బద్దలు కొట్టుకునే బదులు అమ్మ ఆ వెధవ ఆఫీసు మానేసి తన దగ్గరే ఉండిపోవచ్చుగా! రంగిని వాళ్ళ ఊరికి పంపించేయచ్చు గా! అప్పుడు తన దిగులు, బెంగ, అలక-కోపం అన్నీ ఎక్కడి వక్కడ మాయమై పోతా యి. తను మళ్ళీ మునుపటి ఉష అయిపోయి హాయిగా ఖుషీగా ఉంటుంది. బుద్ధిగా చదువుకుని, క్లాసులో ఫస్ట్ మార్కులు తెచ్చుకుంటుంది. కానీ.... ఆ సంగతి వీళ్ళెప్పటికీ తెలుసుకోలేరు. ఒకవేళ తను నోరు తెరచి చెప్పినా సీరియస్‌గా తీసుకోక కొట్టి పారేస్తారు. అందుకే తనేం చెప్పదు....

జ్వరం కారణంగానో లేక మరేమిటో గాని తనకిప్పుడు లేచికూచునే శక్తి కూడా నశించిపోయింది. పూర్తిగా మంచం పెట్టేసిన తనను చూసి అమ్మకూడా ఏడ్చేస్తోంది అప్పుడప్పుడు. ఆఫీసుకు సెలవుపెట్టి రాత్రింబవళ్ళు తన పక్కనే ఉంటున్న అమ్మను చూస్తుంటే తన కెంత ఆనందంగా వుందనీ? కిటికీలోంచి కనిపించే ఆకాశంలో ఎగిరే పక్షుల్లాగా తనూ స్వేచ్ఛగా - స్వతంత్రంగా ఎక్కడికో ఎగిరి పోతున్నట్టని పిస్తోంది.

రోజూ డాక్టరు వచ్చి చూసి మందులిచ్చి పోతున్నాడు. అమ్మా, నాన్నా ఆదుర్దాగా డాక్టరు వెనకాలే వెళతా రు. బాల్కనీలో కెళ్ళాక ముగ్గురూ ఏ వేవో మాట్లాడుకుంటారు. తనకు వాళ్ళ మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నా ఒక్కటీ అర్థం కాదు. బహుశా మాటలు అర్థం చేసుకునే శక్తిని మెదడు కోల్పోయింది కాబోలు!

ఇంట్లో పనులన్నీ ముగించుకుని పక్కింటి ఆంటీ రోజూ తమ ఇంటికి వచ్చి కూచుని అమ్మకి ధైర్యం చెబుతూఉంటుంది. ఆవిడతో బాటు ప్రసూన కూడ వస్తుంది. ఇప్పుడు వాళ్ళింట్లో కూడా కొత్త భయాలు తలెత్తాయిట. వాళ్ళ నాన్న వాళ్ళమ్మతో చెబుతూంటే ప్రసూన విందట. "చూశావా పాపం వాళ్ళ ఉష ఎలా తయారయిందో? ఆ సుధాకరరావుకి మంచి జీతమే వస్తుంది. అయినా ఆ పిల్ల కిష్టం లేనప్పుడు భార్య నెందుకు ఉద్యోగానికి పంపిస్తాడో అర్థం కాదు. డబ్బాశకు పోయి బంగారం లాంటి కూతురి జీవితం నాశనం చేస్తున్నారు.... మన ప్రసూన జాగ్రత్త సుమా! దాని మనసుకు ఏ మాత్రం బాధ కలగకుండా చూసుకోవాలి మనం తెలిసిందా? కొంచెం అటూ ఇటయినా వెంటనే, నాతో చెప్పు. ఆలస్యంచేయకు"అని.

ఆ మాట విని తను పేలవంగా నవ్వింది. వాళ్ళ పిచ్చిగాని ప్రసూన తన లా ఎందు కవుతుంది? అది ఎంతో అదృష్టవంతురాలు. ఆఫీసుకు వెళ్ళకుండా ఎప్పుడూ ఇంట్లోనే వుండే అమ్మ, రోజా కథలూ, కబుర్లూ చెబుతూ-సెలవు రోజుల్లో సినిమాలకూ షికార్లకూ తీసికెళ్ళే నాన్న అందరూ ఉండగా దాని కేం తక్కువని అలుగుతుంది? తిండీ నిద్రా మానేసి దిగులుతో మంచం పట్టే అవసరం దాని కెందుకొస్తుంది?

ఉష మళ్ళీ కిటికీ లోంచి కనిపించే నీలా కాశం వైపు చూసింది. దూది పింజల్లా తేలిపోతున్న తెల్ల మబ్బుతునకలనూ, రెక్కలల్లార్చి స్వేచ్ఛగా ఎగురుతున్న పక్షులనూ, రెప్ప వాల్చకుండా అలా చూస్తూనే ఉండి పోయింది.

ఆ కనురెప్పలు మళ్ళీ కొట్టుకోనే లేదు.

ఆకాశంలో స్వేచ్ఛా విహారం చేస్తున్న ఆ పాప ప్రాణాన్ని ఇప్పుడు ఏ రంగీ ఇంట్లో బంధించలేదు. డిసిప్లేన్ పేరుతో కూతుర్ని పంజరంలో పెట్టిన అమ్మా, నాన్నలూ ఆమె స్వేచ్ఛకు అడ్డురాలేరు. ★

